# మెఱపులు : కాలం పరుగు

-వేమూరి వేంకట రామనాధం, Piscataway, NJ.

నేను క్రిందటివారం ఒక "గ్రోసరీ" స్టోర్‌కు వెళ్ళి, అందులోని "అయిల్స్" లో నెమ్మదిగా పచార్లు చేస్తున్నాను. ప్రత్యేకంగా నేను కొనుక్కోనవలసినది యేమీలేదు. నాకు కావలసినవన్నీ నా కొడుకులు, కోడలు, కుమార్తె, ఎప్పటికప్పుడు తెస్తూనే ఉంటారు. నేను ఊరకే వివిధమైన అరలలో ఉన్న వస్తువులను చూస్తూ నడుస్తున్నాను. ఏ ప్రత్యేక-అవసరం లేదు కాని, ఏయే వస్తువులు ఎంత తక్కువ శాతం "ఫాట్," "కొలెస్టరాల్" మొదలయినవి కలిగియున్నాయో అని సరదాగా చూస్తున్నాను. ఎప్పటికప్పుడు క్రొత్త వస్తువులు "మార్కెట్" లోకి వస్తూవుంటాయి గదా; అయితే ప్రతి దుకాణంలోను ఉండకపోవచ్చు.

ఒక "ఆయిల్" లో షాపింగ్ కార్టు" మెల్లగా తోస్తూ ఒక పెద్దమనిషి కనబడ్డాడు. మెల్లగా అంటే, బలంగా లేక మెల్లగా; అదిచూస్తూ ఉంటేనే తెలుస్తోంది. అతని ముఖం చూశాను, ముడతలు పడి ఉంది. గొంతు ఎంత వదులుగా ఉన్నదో చూస్తే తెలుస్తుంది అతడు చాల వృద్ధుడని. గొతు చర్మం తనంత అదే కదులుతున్నట్లు అనిపిస్తున్నది.

ఆయన దగ్గఱజేరి అన్నాను, "అయ్యా, మీ బండీ నేను తోస్తాను, కొంతసేపు." అతడు నెమ్మదిగా "వద్దు, వద్దు. నా భార్య అక్కడ ఉంది. ఆమె నాకు సాయంచేస్తుంది." అన్నాడు.

సరే నాలుగయిదడుగులు ముందుకు వేశాను. ఒక ముదుసలి స్త్రీ కనపడ్డది. ఆమె యితని భార్య అయిఉంటుంది అనుకున్నాను. ఆమె పైఅరలో ఉన్న వస్తువునేదో తీసికోటానికి ఒక చేయి క్రింది అరమీద దన్నుగా వేసి, రెండవ చేయి పై అరవైపు జాపింది, కాలివ్రేళ్ళమీద నిల్చుంటూ, శరీరం కొంచెంగా వణుకుతూ. ఆమె కోరిన వస్తువు దొరికిందో లేదో కాని, ప్రక్కనున్న వస్తువులు కొన్ని క్రిందపడినాయి. ఆప్రక్కన వెడుతున్న "స్టోర్" సిబ్బందిలోని వాడొకడు గట్టిగా చూపులుత్రిప్పి, వెంటనే ఆమె ముఖంచూసి తగ్గి, క్రిందపడ్డ వస్తువులు సరిగా తిరిగి అరలలో ఏర్పరచాడు. నేను ముందుకు వెళ్ళాను, ఆమెను సరిగాచూస్తూ. ఆమె తన భర్తకన్న కొంత ఎక్కువ వయస్సు దానిలాగా కనపడింది. వయస్సు ఎలాఉన్నా, శరీర పటుత్వంబట్టి నా ఊహ సరియైనదనుకున్నాను.

కొంతసేపటికి నేను "స్టోర్" బైటకు వెళ్ళాను. ఆ పెద్దమనిషి నాలుగు అడుగుల దూరంలో "బండీ" లాగుతూ కనపడ్డాడు, తన కారు వైపు. స్థలం కొంచెం ఎత్తుకోణంలో ఉండటం వల్ల తన బాధ మఱింత ఎక్కువగా కనపడుతోంది. నేను తిరిగి అతని దగ్గఱకు వెళ్ళి, "అయ్యా, యిప్పుడయినా నన్ను సాయం చేయనీయండి," అన్నాను. అతడు వెనుకటిలాగానే, "నాభార్య వస్తున్నది...." అంటూ ఉండగానే నేను బండీమీద చేయివేసి, "రండి, మీ కారువైపు" అన్నాను. దురదృష్టవశాత్తూ వెనుకటి "సెక్యూరిటీ" వాడు అటు రావటం తటస్థించి మావైపు వచ్చాడు. "చూశారా, నేను అప్పుడే అనుకున్నాను. ఇతడు మీ వెనుకనే తారాడుతున్నాడు స్టోర్‌లో. అయ్యా, ఇతడు మీవాడా" అని అతడు అనగానే, "కాదు" అన్నట్లు ఆయన తలత్రిప్పాడు. "అలాగా" అంటూ స్టోర్ మనిషి నాదగ్గఱకు విసురుగా వచ్చాడు, "ముసలివాళ్ళుగదా అని వాళ్ళ బండీ లాక్కుపోవాలనుకున్నావా?" అన్నాడు. "అయ్యో, పుణ్యానికి పోతే పాపం ఎదురయిందని మ్మా సామెత ఒకటి ఉంది" అని నేను గొణుగుకుంటూ ఉండగా, అతని భార్య నెమ్మదిగా వస్తోంది. సెక్యూరిటీ వాడు ఆమెను కూడా అడిగాడు, "ఏమండీ, ఇతడు మీకు తెలుసా, ఎప్పుడయినా చూశారా?" ఆమె నావైపు చూసి వెంటనే అంది, "ఆ, మా యిళ్ళవైపు వాడే. మొన్న "సీనియర్సు" సమావేశంలో చూశాను." నా అదృష్టం బాగుంది; సెక్యూరిటీ వాడు "సారీసార్" అంటూ తనదారిని తాను వెళ్ళాడు.

నేను మెల్లగా ఆమె దగ్గఱకు వెళ్ళి నిల్చున్నాను, కృతజ్ఞత చూపిస్తూ. ఆమె భర్త కూడ అక్కడకు వచ్చి, "మొన్న సమావేశంలో ఈయన ఉన్నాడా, నేను కనిపెట్టనేలేదే" అన్నాడు. ఆమె "అవును" అంటూ నావంక ఆదరభావంతో చూస్తూ, మఱీ మఱీ నా మొగంకేసి చూస్తూ తటాలున అరచింది, "ఊహు ఈయన కాదు. నేను మఱొకరినెవరినో చూశాను, ఈయన అలా ఉన్నట్లున్నాడు, కాని, దగ్గఱకు వచ్చి సరిగా చూస్తే, యీయన కాదండీ" అన్నది. ఆమె భర్త అన్నాడు, "తనకు దృష్టి అంతగా కనపడదండీ, ఎవరినో చూసి మీరనుకుంది."

అంతవఱకు నా అదృష్టం బాగుంది అనుకుని నేను అవతలకు వెడుతూ విన్నాను, అతడు అడుగుతున్నాడు "డియర్, నీవు కారు నడుపుతావా, నేను నడపనా" అని. "మీ యిష్టం డార్లింగ్. నేను తెచ్చిన వాటిలో ఒక క్రొత్తవస్తువు ఉన్నది చూశావా, 'అల్ట్రా గోర్మే డిన్నర్సు అన్న చిన్న డబ్బా. టూ ఫార్ 89 సెంట్స్" అందుకని రెండుకొన్నాను." అతడు తీక్షణంగా ఆ వస్తువులను చూస్తూ "కాని, ఇది డాగ్‌ఫుడ్ నీవు తొందరలో ఇది తీసుకునివుంటావు" అని నిట్టూర్చాడు, బిగ్గఱగా.

నేనూ నిట్టూరుస్తూ న్మాతోవను వెళ్ళాను. ఆ దంపతులకు పిల్లలు, మనుమలు, మునిమనుమలు ఉన్నారో లేరో నాకు తెలియదు. కనీసం వారానికొకమారు తమ కొనుబడుల సందర్భంలోనైనా సాయంచేయగల వారెవరూలేరో యీ "అమెరికన్‌డీమ్" లో, అని విచారించాను.

ఇటీవల నా ఇంగ్లండు యాత్రలో ఒక చిరకాలమిత్రుని యింటికి వెళ్లాను. "ఇక్కడ కొద్దిరోజులు మీరుండవచ్చు, మాయింట్లో తగినంత స్థలం వసతి ఉంది, ఏమీ అనుకోకండి" అని గృహస్థుడు అనగానే అతని భార్య నన్ను ప్రతి గదిలోనికి తీసుకువెళ్ళి అక్కడ ఉన్న ఫోటోలు, చిన్నపిల్లల ఎలుగుబంట్లు మొదలయినవెన్నో కుతూహలకరములైన వస్తువులు చూపించింది. గదులు చక్కగా ఆ ఉదయం తీర్చిదిద్దినట్లున్నాయి. ఏ ఒక్క గదియో అనుకున్నాను మొదటలో; కాని ఏ గదిలోకి వెళ్ళినా అలాగేవుంది.

సరే రెండు రోజులపాటు ఉంటాను అని, ఉత్తరంలో నేను సూచించినట్లే, నిశ్చయించాను, కబుర్లు సరదాగా జరుగుతున్నాయి. భోజనసదుపాయం చాలగొప్పగా ఉంది. మధ్యమధ్య వారి మిత్రులు రావటం, ఉత్సాహంగా అందఱు మాటలాడుతూ ఉండటం జరుగుతూనే ఉంది.

కాని నాకు, ఎందుకో, వారి యిద్దరి మొగాలలోను ఒక విధమైన వెలితి-కాదు వేదన-తాండవిస్తున్నట్లుంది. వారు ఒకరినొకరు చూసుకుంటూ కూర్చున్నప్పుడు అది ఇంకా స్ఫుటంగా గోచరించింది. సరే, ఎన్నో వ్యక్తిగత కారణాలు ఉండవచ్చును అనుకుంటూ, నేనది గమనించనట్లే ప్రవర్తించాను.

రెండవరోజు నా స్నేహితుడు తన క్రిస్టమస్ సరంజామి బైటకుతీసి, తనకు వచ్చిన కార్డులు చూపుతూ, తాను వ్రాస్తున్న ప్రత్యేకమైన

కార్డు నాముందు ఉంచాడు. "చాలాబాగున్నదండీ. మీరు, మీభార్య ఇంత చక్కని వాక్యాలు కూర్చారు. ప్రతియేడు మీ యిరువురి "జంట" శుభాకాంక్షలు నాకు వస్తూనే ఉన్నాయి" అన్నాను.

ఒక్క త్రుటిలో ఆయన ముఖం మబ్బు క్రమ్మినట్లుంది. మెల్లగా నాకు దగ్గఱగా చేరి గుసగుసల స్థాయిలో అన్నాడు, "చూడండి, ఈ వైభోగం ఎన్నాళ్ళో."

నాకు వెంటనే అర్థంకాలేదు. రెండు నిముసాల పిదప ఆయన వంక చూస్తూ, "ఎవరు చెప్పగలరు, ఎవరు ఎన్నాళ్ళో..." అన్నాను. ఆయన ఇంకా దగ్గఱగా చేరి, "అలాంటి బాధ యేమీ కాదండీ. కాని, మా యిరువురిలో ఎవరుముందో...... అన్న ఊహ మనస్సుకు తగలటం ప్రారంభమయింది. ఎవరో ఒకరు ముందుపోవటం తటస్థిస్తుందిగదా, ఏ ప్రమాదంలోనో ఒకసారే యిద్దఱు పోతేతప్ప! ఈ అనుల్లంఘనీయమైన విషయం నాలో ప్రతినిముసం తొలకరిస్తోంది. నేను బ్రదకాలని కాదు, నేను ముందు..... అయితే.. ఆమె.... ఎంతగా మనోవ్యధకు చిక్కుతుందో అన్న బాధతో....అని" కళ్లవెంట నీరు పెట్టుకున్నాడు.

నేనూ విచారంగా తలవంచి, "అయ్యో, యిలాంటి సహజసిద్ధమైన సంఘటనలను గుఱించి మనం ఆలోచించి ప్రయోజనంలేదండీ" అన్నాను. ఆయన అన్నాడు, "అయితే నేను ఆమెతో ఇలాగని ఎప్పుడూ అనలేదు లెండీ."

ఆయన వెంటనే ఎగిరినంత పరువంతో లేచి టేబిల్‌మీద ఉన్న కప్పులు దులుపుతున్నాడు. ఆయన భార్య ప్రక్కగదిలోనుండి కాఫీగిన్నెతో వచ్చింది, నవ్వుతూ.

పదినిముసాలు ముగ్గురం సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కాఫీత్రాగాము, సాసర్‌లో పోసుక్కుత్రాగటం గుఱించి, "ఏక్ గజ్‌కా టీ" వగైరా నవ్వులాటలు, ఏకరువుపెడుతూ. ఆయన పూర్తికాని కాఫీకప్పు చేతపట్టుకొని, "క్షమించండి. నా మెయిల్ చూసివస్తాను" అని ప్రక్కగదిలోకి వెళ్ళాడు.

నేను సోఫాలో బాగా వెనుకకు ఆనుకుంటూ, ఆమెవంకచూస్తూ ఉండగానే, ఆమె ముఖంలో నేను అంతకుముందు పసిగట్టిన మబ్బుచాటిక యేదో క్రమ్ముకున్నట్లు కనపడింది. నేను ఊరకే "కాఫీ చాల బాగుందండీ" అన్నాను. ఆమె చిరునవ్వు నావైపు చిలుకుతునూ, దానివెనుక ఉన్న మబ్బును కప్పుకోలేకపోయింది.

"మీవారు, ఇంతవయసులో కూడ, ఎలా ఎగిరి గంతువేశారో చూడండి" అని నేను సంభాషణార్థం అన్నాను. ఆమె తిరిగి ఒక చిరునవ్వు తున్క విసిరి, మఱల ఏదో దిగులు ఆలోచనలో పడినట్లు ముఖం త్రిప్పుతూ, నావంక తీక్షణంగా చూస్తూ అన్నది, "చూడండి. మాకు అన్నీ ఉన్నాయి. ఏదో కొఱత అనే ఆలోచన లేదు. కాని క్రమంగా నన్ను ఒక మనోవేదన క్రమ్ముకున్నదండీ. మా యిద్దఱిలో ముందు ఎవరు..... అని" అంది. వెంటనే అంది, "నేనే బ్రదికి ఉండాలని కాదండోయి. నేనే ముందు అయితే......ఆయన ఎంతమనోవ్యథతో అన్న వేదన నాలో......." అంటూ కన్నీరు తుడుచుకుంది. "నేనాయనతో ఎన్నడు అనలేదులెండి."

అదివఱకులాగానే బొటబొట కన్నీరు కార్చాను. ఏలోటులేని దంపతుల మనస్సులలో నాట్యంచేసే అనివార్యసంఘటనను గూర్చిన ఆలోచన యింతగా, ఇంత మనశ్శుద్ధితో గమనించడం నా హృదయాన్ని కదల్చింది........

***


NIRMALA AKKAPEDDI, MD

Board Certified Internist

**855 ROUTE 10 EAST, Suite#102**
**Randolph, NJ 07869**
**(973) 927-7800**

Evening & Weekend
Appointments Available

*Most HMOs are Accepted*

On Staff at
**Morristown Memorial Hospital**





**For all your beauty needs:**

Facials, Waxing, Threading, Haircuts
Treatment include Galvanic
(for dry skin, spots)
High frequency (for dandruff, pimples),
Brushing
(for deep cleansing, spots, oily skin)

**Call Shamla at (732) 238-1914**

**Very reasonable prices**

*Located in East Brunswick*